రీమా రావత్‌కు డాక్టర్ సుబ్బారావు అవార్డు

గర్భాశయ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించే అద్భుత పరికరాన్ని రూపొందించిన యూపీఈఎస్(యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్)కు చెందిన రీమా రావత్ ప్రతిష్టాత్మక డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు ఫాబా(ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్) అవార్డుకు ఎంపికయ్యారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో రీమా రావత్‌కు ఫాబా ఈ అవార్డును అందజేశారు. రీమా తన అద్భుత పరిశోధనతో రూపొందించిన పోర్టబుల్ సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరికరానికి ఈ అవార్డును అందజేస్తున్నట్లు ఫాబా అసోసియేషన్ ప్రకటించింది. – కొండాపూర్, ఆగస్టు 21

రోస్టర్ విధానాన్ని అమలు చేయాలి

రోస్టర్ అమలు చేయాలని ఆందోళన చేస్తున్న ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు

సిటీబ్యూరో, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): విద్యుత్ సంస్థల్లో పదోన్నతుల అంశంలో రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని బుధవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. పదోన్నతుల విషయంలో విద్యుత్ సంస్థలో అమలు చేస్తున్న రోస్టర్ విధానాన్ని ఈసారి చేపట్టిన పదోన్నతుల విషయంలో పరిగణలోకి తీసుకోలేదన్నారు. దీంతో విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. రాజ్యాంగ సవరణ ద్వారా వచ్చిన హక్కులను సైతం కాలరాసే విధంగా విద్యుత్ సంస్థల న్యాయ సలహాదారులు వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు వాపోయారు. తమ అసోసియేషన్ తరపున ఈ ఏడాది జనవరిలోనే వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు.అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్ మనోహర్, స్టేషన్ జనరల్ సెక్రెటరీ రమేశ్ మేడి, ఉద్యోగులు నాంపల్లి చంద్రయ్య, సోమ్లా నాయక్, ఇతర సంఘాల ప్రతినిధులు నారాయణ నాయక్, నాగరాజు, ఆనంద్ బాబు, బీమపల్లి ఆనందం, కుమార స్వామి, సత్యనారాయణ, శరత్, రవీందర్, కృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

హోర్డింగ్ కూలి..

బాలం రాయి వద్ద బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన హోర్డింగ్ బుధవారం ఒక్కసారిగా కూలి అక్కడే టీ అమ్ముతున్న బండిపై పడింది. దీంతో ఆ బండి నుజ్జునుజ్జు అయ్యి అందులోని సామన్లు చెల్లాచెదురుగా పడిపోయాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ మహిళ పైన కూడా ఆ హోర్డింగ్ పడింది. దీంతో భయాందోళనకు గురైన ఆమె రోదించింది.

ఎస్సీ వర్గీకరణ అమలుకు ఆర్డినెన్స్ తేవాలి

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ

రవీంద్రభారతి, ఆగస్టు 21: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఆర్డినెన్స్ తేవాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద గల బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు మాదిగ, మాదిగ ఉపకులాల రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. బేడ, బుడగ, జంగాల జేఏసీ చైర్మన్ హన్మంత్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా కొంత మంది కుట్రతో భారత్ బంద్ చేపట్టారని, ఎస్సీ లంతా కలిసి ఉంటే మరింత రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వాలను కోరవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపకులాల నేతలు మంచాల యాదగిరి, జీడీ నర్సింహ, రుక్కమ్మ, జ్యోతి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

రవీంద్రభారతి, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో వెంటనే అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్డినెన్స్ తెచ్చి మాదిగ, మాదిగ ఉపకులాలు రిజర్వేషన్ ఫలాలు అమలు చేయాలని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు గడిప నాగయ్య కోరారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనకు 30 ఏండ్లుగా పోరాడిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు అభినందనలు తెలిపారు. మాదిగలు మందకృష్ణ మాదిగకు రుణపడి ఉంటారని, ఆయన పోరాట ఫలితమే ఈనాడు ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ పకడ్బందీగా అమలు చేశారని తెలిపారు. నర్సింగ్ క్లత్ ఎంపోరియంలో పనిచేస్తున్న శ్యాంప్రసాద్‌నాయుడు, రతన్ శ్యాంసుందర్‌ను ఉద్యోగం నుంచి తొలగించడం సరికాదన్నారు. వెంటనే వారిని ఉద్యోగంలోకి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో వారికి రావాల్సిన గ్రాట్యుటీ, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ కార్యదర్శి టి.బాలరాజు, బి.వెంకటేశ్వరరావు, బి.రామచందర్, శివకుమార్‌లాల్, రౌతు రాజయ్య, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు గడిప నాగయ్య

సీఎంఆర్ ఉమెన్స్ త్రోబాల్ టోర్నమెంట్

విజేతలకు లక్షన్నర నగదు బహుమతి

సిటీబ్యూరో, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): మహిళా ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఉమెన్స్ త్రోబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని సీఎంఆర్ టెక్స్‌టైల్స్, జ్యూయలర్స్ ప్రతినిధి తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సీఎంఆర్ గ్రూపు అనుబంధ సంస్థలు మొత్తం 40 స్టోర్స్ ఉండగా, అందులో 800 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరికీ వెంకోజీ పాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీఎంఆర్ ఫ్యాషన్స్, మద్దిల పాలెం వారు విజేతలుగా నిలిచారని తెలిపారు. అదేవిధంగా సీఎంఆర్ జ్యూయలర్స్ గోపాలపట్నం టీం రన్నర్‌గా నిలిచింది. సీఎంఆర్ టెక్స్‌టైల్స్, జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మాకూరి హరిక విజేతలకు రూ.1,50,000 నగదు బహుమతిని, సర్టిఫికెట్లు, షీల్డులను అందజేశారని తెలిపారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 21 : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గురువారం నుంచి రెండురోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం గౌరవ సంచాలకులు డా.సుహాసిని ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి, ఎకానమీ అడ్వైజర్ డా.దేవజిత్ ఖవుండి హాజరవుతారన్నారు. పాటు నేషనల్ వర్క్‌షాప్ ఆన్ కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ స్కీమ్‌పై వర్క్‌షాప్ జరుగుతుందని, అడ్వైజర్‌గా ధనుంజయ్ ప్రసాద్ శ్రీవాత్సవ, రెండుతెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని మరో 17 రాష్ట్రాల నుంచి 120 మంది ప్రతినిధులు హాజరవుతారని ఆమె పేర్కొన్నారు.

ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తకు నేషనల్ జియోసైన్స్ అవార్డు

సీఎస్ఐఆర్–ఎన్‌జీఆర్ఐ చీఫ్ సైంటిస్టు డాక్టర్ బంటు ప్రశాంతకుమార్ పాత్రోకు నేషనల్ జియోసైన్స్ అవార్డు –2023కు ఎంపిక య్యారు. ఈ మేరకు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. జియోఫిజిక్స్ విభాగంలో డా.పాత్రో చేపట్టిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డును అందజేశారు. భూమి యొక్క ఉపరితలం గురించి మన జ్ఞానాన్ని మరింతగా పెంచడమే కాకుండా, ఖనిజ అన్వేషణ, భూగర్భ జల నిర్వహణ, తదితర అంశాలపై పరిశోధనలు చేపట్టారు. ఈ మేరకు పలువురు శాస్త్రవేత్తలు ఆయనకు అభినందనలు తెలియజేశారు. – ఉప్పల్, ఆగస్టు 21

గ్రేటర్‌లో చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ బృందం పర్యటన

గ్రేటర్‌లో చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.కుమార గురుబరన్ బృందం బుధవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, మోడల్ గ్రేవ్ యార్డు నిర్మాణాలపై అధ్యయనం చేసేందుకుగాను ఈ పర్యటన చేశారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా సంజీవయ్య పార్కులో చేపట్టిన ట్రాన్స్‌ఫర్ స్టేషన్, ఇందిరాపార్కు, జూబ్లీహిల్స్‌లో మహాప్రస్థానం నిర్వహణ గురించి సంబంధిత అధికారులు వారికి వివరించారు. మహాప్రస్థానం నిర్వహణ తీరు బాగుందని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.కుమార గురుబరన్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో సౌలిడ్‌వేస్ట్ ఏఈ అజ్జల్, ఏఎంహెచ్ఓ భార్గవ్ నారాయణ, లైజన్ అధికారి వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ జేడీ విల్సన్ తదితరులు పాల్గొన్నారు. – సిటీబ్యూరో, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ)

ఎన్‌హెచ్-44 రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి:కలెక్టర్ గౌతమ్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 21 : బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు రూ.1000 కోట్లతో నిర్మిస్తున్న ఆరు లైన్ల రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి ఎన్‌హెచ్-44 రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన పనులపై బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని, రోడ్డు నిర్మాణంలో అడ్డుగా ఉన్న పెట్రోల్ బంక్ అనుమతులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అండర్ పాస్ స్లిప్ రోడ్ పనులు, విద్యుత్ టవర్స్, డ్రైన్లు, పైప్‌లైన్ల పనులకు ఆటంకం కలుగకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, అధికారులు శ్రీనివాస్ రావు, ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ వైద్యురాలికి న్యాయం జరిగేవరకు పోరాడుతాం

తెలంగాణ జూడా అసోసియేషన్

ఖైరతాబాద్, ఆగస్టు 21: కోల్‌కత్తాలోని ఆర్‌జే కేఆర్ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ ఘటనలో ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని జూనియర్ డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ఈఎస్ఐకి చెందిన జూనియర్ డాక్టర్లు నిమ్స్ దవాఖానలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యంపై ఇప్పటి వరకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వలేదని జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ రాహుల్, డాక్టర్ ఐసాక్ న్యూటన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ వంశీ, డాక్టర్ వెంకటేశ్‌కుమార్ అన్నారు. నేటి వరకు నిందితుల పేర్లను బయటపెట్టలేదని, బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందా? లేదా అనేది తేల్చాల్సి ఉందన్నారు. ఘటన జరిగిన వైద్య కళాశాలలో సరైన సెక్యూరిటీ వ్యవస్థ కూడా లేదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ టర్మినేషన్ ఇంకా పూర్తి కాలేదని, ఇందులో అతని పాత్ర ఏమిటనేది, ఎవరెవరూ బాధ్యులు ఉన్నారో వెలుగులోకి రావాలన్నారు. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన సెంట్రల్ ప్రొటక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని, రాష్ట్రంలోనూ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రాజ్

హిమాయత్‌నగర్, ఆగస్టు 21: రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్.ఎన్‌రెడ్డి భవన్‌లో యూనియన్ నగర నిర్మాణ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు స్వయం ఉపాధి కోసం ఆటోలను నడుపుకుంటూ తక్కువ ఆదాయంతో జీవనం సాగిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లకు కిరాయిలు లేక పూట గడవడం కష్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక భద్రత కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఏడాదికి రూ.12వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఆటోడ్రైవర్లు సంఘటితమై ప్రభుత్వ మెడలు వంచి హక్కులు సాధించుకునేందుకు బలమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి కమతం యాదగిరి, యూనియన్ నగర అధ్యక్షుడు కొంరెల్లి బాబు, నగర ప్రధాన కార్యదర్శి సీహెచ్.జంగయ్య, భిక్షపతి యాదవ్, ఎస్.అశోక్, ఒమర్‌ఖాన్, జి.మల్లేశ్, ఎస్.కె.లతీఫ్, ఎంఏ జాకీర్, శ్యామ్‌నాయక్, ఎండి.సలీం, రవి పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రధాన కార్యాలయం ఆవరణలోని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించిన మంత్రి కొండా సురేఖ తదితరులు

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

సుల్తాన్‌బజార్,ఆగస్టు 21: బోనాలు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బొగ్గులకుంట దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలోని బంగారు మైసమ్మ దేవాలయంలో టీఎన్జీవో ఎంప్లాయీస్ యూనిట్ అధ్యక్షుడు బాబుశంకర్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు బోనాలతో, డప్పు వాయిద్యాల మధ్య పోతరాజుల నృత్యాలతో అమ్మవారికి బోనాలు, తొట్టెలను సమర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంతరావు, అడిషనల్ కమిషనర్‌లు కె.జ్యోతి, ఎంఎండీ క్రిష్ణ వేణి, ఆర్‌జేసీ రామక్రిష్ణారావులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ అధ్యక్షుడు బాబుశంకర్, ఉపాధ్యక్షుడు నిఖిల్ రాజ్ సక్సేనాలు ముఖ్యఅతిథులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి.క్రిష్ణప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ టి.వెంకటేశ్‌తోపాటు దేవాదాయ శాఖ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

'క్విక్ వైటల్స్' యాప్ ఆవిష్కరణ

సిటీబ్యూరో, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): బిసమ్ ఫార్మాస్యూటికల్స్ ఏఐ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ 'క్విక్ వైటల్స్'యాప్‌ను బుధవారం మాదాపూర్‌లోని హోటల్ అవసా వేదికగా ప్రారంభించింది. అనంతరం వైద్యరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్రపై ప్యానెల్ డిస్కషన్ జరిగింది. ఈ కార్యక్రమంలో బిసమ్ ఎండీ హరీశ్, ప్లానింగ్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ చిన్నారెడ్డి, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సుధా, డ్రగ్ కంట్రోల్ అథారిటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొని చర్చించారు. హెల్త్ డేటాను ఎలా సేకరించాలి? ఎలా విశ్లేషించాలి అనే అంశాలపై వక్తలు మాట్లాడారు.

కళా సంగీత నాట్య వేదిక ప్రారంభం

చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కళా సంగీత నాట్య వేదిక ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ.రమణాచారి పాల్గొని నాట్య వేదికను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంగీత నృత్య కళాశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఎంతో ఔత్సాహికులకు ఉపయోగపడుతుందన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దన్‌మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హాస్యావధాని శంకర్‌నారాయణ, చక్రపాణి, ప్రసాద్, గీత, పురాణ పండ శ్రీనివాస్ పాల్గొన్నారు. – ముషీరాబాద్, ఆగస్టు 21

డిపాజిట్ల పేరుతో మోసం.. సీసీఎస్‌లో ఫిర్యాదు

సిటీబ్యూరో, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): డిపాజిట్లు చేస్తే మంచి లాభాలు ఇస్తామని నమ్మించి మోసం చేశారని బాధితులు సీసీఎస్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. టోలిచౌకికి చెందిన మహ్మద్ అబ్దుల్ హదీ, మహ్మద్ అలీముద్దీన్ ఫారూఖీలు కాలేజీ రోజుల నుంచి స్నేహితులు. అలీముద్దీన్ అత్తాపూర్‌లో ఎన్ఏఎఫ్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఓ సంస్థను నిర్వహిస్తున్నాడు. డిపాజిట్లు చేస్తే మంచి లాభాలు ఇస్తామని నమ్మించి చాలా మంది నుంచి డిపాజిట్లు సేకరించారు. అదేవిధంగా కెనడా, అమెరికా వెళ్లే విద్యార్థులకు వీసాల ప్రాసెసింగ్ చేస్తామంటూ నమ్మబలికాడు. ఇలా ఎంతో మంది అతన్ని నమ్మి పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించారు. ఇలా తన స్నేహితుడైన అబ్దుల్ హదీ నుంచి 2020 ఫిబ్రవరి 25న రూ.10లక్షలు పెట్టుబడిగా తీసుకున్నాడు. ఆపై తన భార్య ద్వారా రూ.30లక్షలు, మరో స్నేహితుడి ద్వారా రూ.10లక్షలు పెట్టుబడిగా పెట్టారు. ఇలా మొత్తం సుమారు రూ.1.12 కోట్లను వసూలు చేసిన అలీముద్దీన్ గత ఏడాది కెనడా ఉడాయించాడు. ఈ వ్యవహారంలో అలీముద్దీన్‌తోపాటు ఆయన భార్య అస్మా సుల్తానా, కుమారుడు ఎహబుద్దీన్ ఫారూఖీ, సోదరుడు ముజఫరుద్దీన్ ఫారూఖీల పాత్ర ఉందంటూ హదీ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విరాళాల పేరుతో మోసం..

గాజా, పాలస్తీనాల్లో ఉన్న పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకొని, విరాళాలు సేకరించి మోసం చేశారని సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. బోరబండకు చెందిన సయ్యద్ అయూబ్ హైదరాబాద్ యూత్ కరేజ్ పేరుతో స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం గాజా, పాలస్తీనాల్లో ఉన్న పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకొని అక్కడి బాధితులను ఆదుకునేందుకు సోషల్ మీడియా ద్వారా విరాళాలు ఇవ్వాల్సిందిగా కోరాడు. వాటిలో ఆయా దేశాల్లోని బాధితులకు సరుకులు పంపిస్తున్నట్లు నమ్మబలికాడు. ఇలా అనేక మంది నుంచి రూ. కోటికి పైగా వసూలు చేసి, వారిని మోసం చేసినట్లు సైదాబాద్‌కు చెందిన న్యాయవాది పి.సాయి కిశోర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో సల్మాన్ ఖాన్ అనే వ్యక్తి పాత్ర ఉన్నట్లు తేల్చారు. కేసు విచారణ నిమిత్తం నగర నేర పరిశోధన విభాగానికి అప్పగించడంతో సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బతుకమ్మ ఆడేందుకు కుంటను పునరుద్ధరించండి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరిన వి.హనుమంతరావు, రోహిన్‌రెడ్డి

అంబర్‌పేట, ఆగస్టు 21: వచ్చే బతుకమ్మ పండుగ నాటికి మహిళలు బతుకమ్మ ఆడేందుకు బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంటను పునరుద్ధరించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా.రోహిన్‌రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. గతంలో బతుకమ్మకుంటలోనే మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేసేవారని, ఇప్పుడు డ్రమ్ముల్లో నీళ్లుపెట్టి నిమజ్జనం చేసే పరిస్థితి వచ్చిందని చెప్పారు. బతుకమ్మకుంటలోని ఆక్రమణల తొలగింపు, కుంటను పునరుద్ధరించే విషయమై వీహెచ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డా.రోహిన్‌రెడ్డి బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పిలిపించి వివరాలు అందజేశారు. మొత్తం 5 ఎకరాల్లో బతుకమ్మకుంట విస్తరించి ఉండగా.. ప్రస్తుతం రెండు ఎకరాలకే పరిమితమైందని తెలిపారు. మిగతా స్థలం ఆక్రమణలకు గురైందని కమిషనర్‌కు చెప్పారు. అయితే పేదలు కట్టుకున్న ఇండ్ల దగ్గరకు వెళ్లకుండా కుంటను పునరుద్ధరించాలన్నారు. వివరాలు తెలుసుకున్న కమిషనర్ రంగనాథ్ మొదట స్థలం మొత్తం సర్వే చేయిద్దామని, ఈ కుంటకు సంబంధించిన పేపర్లు అన్నీ తీసుకొని గురువారం హైడ్రా కార్యాలయానికి రావాలని సూచించారు. కుంటను పునరుద్ధరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటానని తెలిపారు.



బతుకమ్మకుంట వివరాలను మ్యాప్ ద్వారా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వివరిస్తున్న మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు తదితరులు

జ్యోతిరావు పులే ఆడిటోరియాన్ని నిర్మించాలి

ఛే నంబర్ చౌరస్తాలో మహ్మద్ ఆజాం అనే వ్యక్తి ప్రభుత్వానికి అప్పగించిన మిగులు భూమిలో జ్యోతిరావు పులే ఆడిటోరియాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్న వి.హనుమంతరావు కోరారు. ఆడిటోరియం ఏర్పాటు చేస్తే పేదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఈ రెండు విషయాలపై మాట ఇచ్చామని, అవి సాధిస్తామన్నారు. కార్యక్రమంలో అంబర్‌పేట తహశీల్దార్ వీరభాయి, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుమిత్ర, హైడ్రా ఏఈలు, మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాలాను ఆక్రమించి రోడ్డేసుకున్నారు..

హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

కొండాపూర్, ఆగస్టు 21: తమ ప్లాట్‌కు రోడ్డు కోసం నాలాను కుదించి సీసీ రోడ్డు వేసుకున్నారని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదంటూ బీఆర్ఎస్ నాయకుడు మిద్దెల మల్లారెడ్డి నాలా ఆక్రమణపై హైడ్రాకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. చందానగర్ సర్కిల్-20 పరిధిలోని పోలీస్‌స్టేషన్ వెనకాల నుంచి శిల్పా ఎన్‌క్లేవ్‌కు వెళ్లే మార్గంలో మియాపూర్ పటేల్ చెరువు నుంచి నక్కవాగులోకి వెళ్లే 12 మీటర్ల వెడల్పుతో ఉన్న నాలాపై తమ ప్లాట్‌కు వెళ్లే మార్గంగా సుమారు 100 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మించుకున్నట్లు ఆయన తెలిపారు. 12 మీటర్ల వెడల్పున్న నాలాను 6 మీటర్లకు కుదించి నిర్మాణం చేశారని, సదరు రోడ్డు నిర్మాణంపై గతంలో ఫిర్యాదు చేయగా, తూ.తూ మంత్రంగా కూల్చివేయగా, ప్లాట్ యాజమాని మరోస